మహేశ్వరంలో మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కవిత అరెస్టు అప్రజాస్వామికం

● అక్రమ అరెస్ట్‌కు నిరసనగా ధర్నా ● మోదీ దిష్టిబొమ్మ దహనం ● కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

బడంగ్‌పేట, మార్చి16: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అక్రమమని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మహేశ్వరం నియోజక వర్గ కేంద్రంలో ధర్నా నిర్వహించారు. కవిత అరెస్టును నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ ముందుగా సాక్షిగా పిలిచి అనంతరం నిందితురాలిగా చేర్చి ఎన్నికల నోటిఫికేషన్ ఒక రోజు ముందు అరెస్టు చేయడం రాజకీయ కుట్ర అన్నారు. ఇదే కేసు విషయంలో సుప్రీం కోర్టులో ఈనెల 19న వాదనలు ఉండగా హడావుడి చేసి అరెస్టు చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. వేల కోట్లు దోచుకొని దేశం విడిచి వెళ్లిపోతున్న వారిని వదిలి పెట్టి కేసులో ఎలాంటి సంబంధం లేని ఆడబిడ్డను మోదీ ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొనలేక అరెస్టులకు తెరలేపారన్నారు. మోదీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని అక్రమ అరెస్టు లు చేస్తున్నారన్నారు. న్యాయ వ్యవస్థ మీద తమకు నమ్మకం ఉందన్నారు.

మహేశ్వరంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి ఉన్న ఉద్యోగాలు తీసి వేస్తున్నారన్నారు. నల్లా చట్టాలను వ్యతిరేకించినందుకు మోటర్లుకు మీటర్లు పెడుతామని చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరవింద్ శర్మ, రాజు నాయక్, అర్కల కామేశ్ రెడ్డి, పాండు యాదవ్, కామేశ్‌రెడ్డి, అంబయ్య యాదవ్, చంద్రయ్య, లక్ష్మీనర్సింహారెడ్డి, దిండు భూపేశ్ గౌడ్, సునీత బాల్‌రాజ్, మోహన్ నాయక్, శ్రీలత, కృష్ణ, రాజు ముదిరాజ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నేత సామ స్వప్నసుందర్‌రెడ్డి

అక్రమ అరెస్టులకు బీఆర్ఎస్ పార్టీ భయపడదు

సైదాబాద్, మార్చి 16 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ శనివారం బీఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు సంతోష్‌నగర్ చౌరస్తాలో ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వప్న సామ సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈడీ అధికారులు ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని అణిచివేస్తూ ఏదో విధంగా ఇబ్బందులకు గురిచేయాలని, పార్టీని బలహీనపరిచేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈడీ దాడులతో కుట్రలు పన్నుతున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఐఎస్ సదన్, సంతోష్‌నగర్, కుర్మగూడ డివిజన్ అధ్యక్షులు మెట్టు భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, దర్శనం నర్సింగ్‌రావు, ప్రవీణ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ సదన్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

కుట్రపూరితంగా అరెస్ట్ చేయడం సరికాదు

మన్సూరాబాద్, మార్చి 16: అక్రమంగా అరెస్ట్ చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త హెచ్చరించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఎల్బీనగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గారపు దయానంద్‌గుప్త మాట్లాడుతూ బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులపై అక్రమ కేసులను బనాయిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉండగా ఈడీ కుట్రపూరితంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. రాజకీయంగా మాజీ సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోలేక బీజేపీ రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్‌కుమార్, జీవీ సాగర్‌రెడ్డి, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, తూర్పాటి చిరంజీవి, ఏలుకొండ రాంకోటి, బాలాజీ గైక్వాడ్, రాగిరి ఉదయ్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 4.19 కోట్లతో అభివృద్ధి పనులు

మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, మార్చి 16: జీహెచ్ఎంసీ నిధులతో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కాలనీల రూపురేఖలను మార్చి ఆదర్శవంతంగా తీర్చిదిద్దే ప్రక్రియ ప్రారంభమైందని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి శ్రీరామ్‌నగర్‌కాలనీలోని కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సహకారంతో మన్సూరాబాద్ డివిజన్ అభివృద్ధి కోసం రూ. 4.19 కోట్ల నిధులను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. సూర్యోదయకాలనీ కమ్యూనిటీ హాల్ రూ. 58 లక్షలు, శివంహిల్స్‌కాలనీలో బోర్‌వెల్ కోసం రూ. 2.30 లక్షలు, వినాయక్‌నగర్ కమ్యూనిటీ హాల్ కోసం రూ. 34.50 లక్షలు, అనితానగర్ కమ్యూనిటీ హాల్ కోసం రూ. 34.50 లక్షలు, సీఆర్ ఎన్‌క్లేవ్ కమిటీ హాల్ కోసం రూ. 22 లక్షలు, చంద్రపురికాలనీలో షటిల్ కోర్టు, ఓపెన్ జిమ్ కోసం రూ. 35.50 లక్షలు, మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో ఓపెన్‌జిమ్ కోసం ర. 15.80 లక్షలు, హకీమాబాద్‌లో సీసీరోడ్డు పనుల కోసం రూ. 19 లక్షలు, వీరభద్రనగర్ కాలనీలో ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధికోసం రూ. 2.10 లక్షలు, మన్సూరాబాద్ పెద్దచెరువు మరమ్మతుల కోసం రూ. 4 లక్షలు, రంజాన్ పండుగ సందర్భంగా మసీదుల మెయింటెనెన్స్ కోసం రూ. 4.40 లక్షలు, కామినేని చౌరస్తా, ఎల్బీనగర్ చౌరస్తాలోని కూడళ్లలో అభివృద్ధి పనుల కోసం రూ. 1.33 కోట్లు, ఆగమయ్యకాలనీ పార్కు అభివృద్ధి కోసం రూ. 6 లక్షలు, శివంహిల్స్‌కాలనీ నుంచి దుర్గానగర్ వరకు సీసీరోడ్డు పనుల కోసం రూ. 21.30 లక్షలు, పవనగిరికాలనీ ఫేజ్-2లో సీసీ రోడ్డు పనుల కోసం రూ. 21.50 లక్షలు, వీకర్‌సెక్షన్‌కాలనీలో అసంపూర్తిగా మిగిలిన పనుల కోసం రూ. 6.90 లక్షల నిధులను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. పలు కాలనీల్లో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరీశ్‌రెడ్డి, కడారి యాదగిరియాదవ్, యంజాల సురేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలి

సైదాబాద్, మార్చి 16 : చంపాపేట శ్రీత్రివేణి పాఠశాలలో శనివారం ''టాట్ ఫేయస్టా లార్నింగ్ విత్ ఫన్'' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమాన్ని శ్రీత్రివేణి పాఠశాల డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పాఠనాసక్తి కలిగించే అంశాలపై దృష్టిసారిస్తే ఉత్తమంగా తీర్చిదిద్దవచ్చన్నారు. ప్రీప్రైమరీ విద్యార్థిని, విద్యార్థులు అభ్యసిస్తున్న పలు అంశాలు, కలర్స్, సీజన్స్, పాటర్న్స్, ఫెస్టివల్, నంబర్స్, ఫోనిక్ సౌండ్ సైట్ వర్డ్స్ వంటి ఎన్నో, ఎన్నోన్నో విషయాలను ''ఆక్టివిటీ బేసిడ్ లెర్నింగ్'' విధానంలో ఏ విధంగా అభ్యసిస్తున్నారనే అంశాలకు సంబంధించిన పలు ప్రదర్శనలను ఏర్పాటు చేశారని తెలిపారు. పలు ఎగ్జిబిట్స్ ప్రదర్శనలను చూసిన సందర్శకులు విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను ప్రశంసించారు. ప్రిన్సిపాల్ శారద, కోఆర్డినేటర్స్ మాధురి, శ్వేత పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

ఆర్కేపురం, మార్చి 16 : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. శనివారం ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీలోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదండరామ్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానంతో విలువైన ప్రాణాలను కాపాడవచ్చిన తెలిపారు. అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదన్నారు. సుమారు 100 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఉస్మానియా ఆసుపత్రికి అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యం, అధ్యాపకులు శ్రీలక్ష్మి, సుధా పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి

కందుకూరు. మార్చి 16 : విద్యార్థులు విద్యలో రాణించాలని ఎన్ఎస్ యుఐ రాష్ట్ర నాయకుడు తల్లోజు వినోద్ చారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐనఓలు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని రాచులూరు గేటు వద్ద గల ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులను ఆదుకోవాలని వారు కోరారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. బట్టి చదువులకు స్వస్తి పలికి ఇష్టపడి చదువుకోవాలని కో రారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగభూషణాచారి. వసుంధర, నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, మార్చి 16 : డివిజన్‌లోని హైకోర్టు కాలనీలో శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా గణనాథుడి కృపతో డివిజన్‌లోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

బడంగ్‌పేట, మార్చి16: చెరువు శిఖంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను బాలాపూర్ తాసీల్దార్ మాధవి రెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేశారు. బాలాపూర్ రెవెన్యూ పరిధిలోని అల్మాస్‌గూడ సర్వేనంబర్ 86/1లో ఉన్న ఎర్ర కుంట చెరువు శిఖంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు రావడంతో చెరువు శిఖం భూమిని అధికారులు సర్వే చేశారు. సర్వే చేసిన తర్వాత ఎకరం స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన్నట్లు అధికారులు గుర్తించారు. రెండు ఇండ్లు, 4 దొడ్లను, రేకుల షెడ్లను జేసీబీల సహాయంతో కూల్చివేశారు. విషయం తెలుసుకున్న కబ్జా దారులు సంఘటన స్థలానికి చేరుకొని వాగ్వాదానికి దాగారు. నిర్మాణాలు కూల్చకుండా అడ్డుకున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడానికి చొరవ తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ భూములు ఎవరు కబ్జా చేసినా ఇదే పరిస్థితి పునరా వృతం అవుతుందన్నారు.

ఎర్ర కుంట శిఖంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి

ఎల్బీనగర్ , మార్చి 16 : కొత్తపేట డివిజన్‌లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. శనివారం కొత్తపేట తోట రెసిడెన్సీలో ఉచిత తాగునీటి సరఫరా కేంద్రాన్ని కార్పొరేటర్ పవన్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం కొత్తపేట డివిజన్లోని వివిధ ప్రాంతాల్లో జలమండలి అధికారులతో పర్యటించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ డ్రైనేజీ పనులు చేపట్టిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సుందర్ నారాయణ, గోపాల్, మహేందర్ యాదవ్ , ఎలిమినేటి జంగారెడ్డి, అపార్ట్‌మెంట్ వాసులు రాధాకృష్ణమూర్తి, రాజీవ్, సుధాకర్, శ్రీనివాస్ గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

రహదారుల నిర్మాణంలో ప్రత్యేక జాగ్రత్తలు

సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది

మలక్‌పేట, మార్చి 16: పాత మలక్‌పేట డివిజన్‌లో రహదారుల నిర్మాణంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ తెలిపారు. డివిజన్ పరిధిలోని అఫ్జల్‌నగర్ సబ్‌స్టేషన్‌వద్ద నిర్మిస్తున్న వీడీసీసీ రోడ్డు నిర్మాణాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికే అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. గతంలో 25 ఫీట్ల వెడల్పు గల రోడ్డులో 12 ఫీట్లు, 15 ఫీట్ల సీసీ రోడ్డును నిర్మించి రెండు పక్కల మట్టి రోడ్డును అలాగే వదిలేయటం ద్వారా వర్షం పడితే రోడ్లన్నీ బురదమయం అయ్యేవని, ఇప్పుడు అలా కాకుండా రోడ్ల పైకి మట్టి రాకుండా వాల్ టు వాల్ సీసీ రోడ్లను నిర్మించటం జరుగుతుందని ఆయన తెలిపారు. సీసీ రోడ్లు ఒక్కసారి నిర్మిస్తే 20 ఏండ్ల వరకు ఎలాంటి రిపేర్లు ఉండవని, ఎక్కువ కాలం మన్నిక వస్తాయని అన్నారు. ప్రజాధనం వృధా చేయకుండా ఎక్కువ కాలం మన్నిక వచ్చే సీసీ రోడ్ల నిర్మాణానికే అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే డివిజన్‌లోని అనేక కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించటం జరిగిందని, చాలావరకు కాలనీల్లో నిర్మాణాలు పూర్తవగా, కొన్ని రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, మరికొన్నింటికి శంకుస్థాపనలు కూడా చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, వార్డు కమిటీ సభ్యుడు సజ్జాద్‌ఖాన్, ఏరియా సభ సభ్యుడు మహ్మద్ ఇంతియాజ్, జాహెద్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు,మార్చి16: రంగారెడ్డి జిల్లా కోర్టుల ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ యొక్క లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 33 బెంచ్‌లను ఏర్పాటు చేయగా పరిష్కారం చేసుకునుటకు వీలయ్యే క్రిమినల్, సివిల్, మోటర్ వాహన ప్రమాదబీమా, బ్యాంకు రికవరి కేసులు, చెక్‌బౌన్స్‌తో పాటుగా ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించి బాధితులకు రూ. 6కోట్ల 25 లక్షల పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించినట్టు రంగారెడ్డి జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఇందిర తెలిపారు. యాక్సిడెంట్ కేసులో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ ద్వారా యాభై నాలుగు లక్షల రూపాయల పరిహారం ఇప్పించారు.ఈ యొక్క కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు,బార్ అసోసియేషన్ అధ్యక్ష, దీకొండ రవీందర్,ప్రధాన కార్యదర్శి పి.మాధవరెడ్డి, డిప్యూటి డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కస్తూరిబాయితో పాటు బ్యాంక్,పోలీస్,ఇన్సూరెన్స్ అధికారులతో పాటు పలువురు న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

నివాళులర్పిస్తున్న వాసవిక్లబ్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్

మన్సూరాబాద్, మార్చి 16: మన్సూరాబాద్ డివిజన్ పరిధి చిత్రసీమకాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్సూరాబాద్ వాసవిక్లబ్ ఆధ్వర్యంలో శనివారం పొట్టి శ్రీరాములు 123వ జయంతిని నిర్వహించారు. సభ్యులు పెద్ద ఎత్తున హాజరై పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమైనవని వాసవిక్లబ్ సభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు మొరిశెట్టి సంతోష్‌కుమార్, కార్యదర్శి ఎస్ఎస్ రావు, కోశాధికారి అంజిబాబు, సభ్యులు అనిల్, లింగమయ్యగుప్త, నాంపల్లి రమణ, అశోక్, భాస్కర్, యాదగిరి పాల్గొన్నారు.

హనుమంతుడి విగ్రహం ధ్వంసం

కందుకూరు. మార్చి 16 : గుర్తు తెలియని వ్యక్తులు హనుమంతుడి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. మండల పరిధిలోని చిప్పలపల్లి గ్రామంలో గల ప్రకృతి ఆశ్రయం వద్ద ఏర్పాటు చేసిన హనుమంతుడి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని గ్రామస్తులు తెలిపారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

రేషన్ బియ్యం కొంటే క్రిమినల్ కేసులు

కందుకూరు. మార్చి 16 : రేషన్ బియ్యాన్ని అధిక ధరలకు కొని .అక్రమంగా తరలించే వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ మాచన రఘునందన్ తెలిపారు. శనివారం మండల పరిదిలోని వివిధ రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన అనంతరం మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు. కొందరు రేషన్ బియ్యాన్ని అధిక ధరలకు కొని తిరిగి రైస్ మిల్లులకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. బియ్యం సరఫరాలో అక్రమాలకు తావులేదని చెప్పారు. లబ్ధిదారులు ఉచితంగా బియ్యం తీసుకొని విక్రయిస్తున్నారని బియ్యం విక్రయించే వారిని గుర్తించి వారిపై కూడా చర్యలు తప్పవని వివరించారు. ప్రభుత్వం పేదలకు ఉచితంగా బి య్యం పంపిణీ చేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ఎల్బీనగర్ , మార్చి 16 : అనుమానాస్పదస్థితిలో యవకుడు మరణించిన సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. చైతన్యపురి పోలీసుల కథనం ప్రకారం.. మోహన్‌నగర్ ప్రజయ్‌నివాస్ ఫేజ్ 1 ప్రాంతానికి చెందిన ఉప్పలమ్మ కుమారుడు శ్రీకాంత్ (25) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆటో డ్రైవింగ్ చేసే శ్రీకాంత్ వచ్చిన డబ్బులతో మద్యం సేవించి తల్లిపై దాడి చేసేవాడు. 15న సాయంత్రం 4 గంటల సమయంలో శ్రీకాంత్ మద్యం తాగిన మత్తులో ఇంటికి చేరుకున్నాడు. తాగి వచ్చిన కొడుకు తనపై దాడి చేస్తాడనే భయంతో ఉప్పలమ్మ తన అక్క బసవమ్మ (ఉమ) ఇంటికి వెళ్లింది. అయితే శ్రీకాంత్ ఈ విషయాన్ని గమనించి బసవమ్మ ఇంటికి వెళ్లి ఆమెతో పాటుగా ఆమె ఇద్దరు కొడుకులతో గొడవ పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన నాని అతని మరో స్నేహితుడు శ్రీకాంత్‌ను ఒక గది లోకి తోసి బయట నుంచి గడియపెట్టారు. అనంతరం శ్రీకాంత్, నానిలు ఇరువురు తమ నివాసాలకు వెళ్లి నిద్రించారు. కాగా శనివారం ఉదయం 6 గంటలకే శ్రీకాంత్ నిద్ర నుంచి లేచిన వెంటనే మరలా నాని నివాసానికి వెళ్లి గొడవ పడ్డాడు. అనంతరం శ్రీకాంత్ తన మిత్రుడు స్వామితో కలిసి బయటకు వెళ్లి మద్యం సేవించాడు. అనంతరం తనకు తన శరీరంలో నొప్పులు ఉన్నాయని తనను ఇంటి వద్దకు తీసుకుని వెళ్లాలని కోరాడు. స్వామి వెంటనే శ్రీకాంత్‌ను ఉప్పలమ్మ కుమార్తె సుజాత ఇంటి వద్ద వదిలివెళ్లాడు. శ్రీకాంత్ అక్కడ నిద్రిస్తూనే మరణించాడు. తల్లి ఉప్పలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన తెలుగు జాతీయ సదస్సు



హయత్‌నగర్, మార్చి 16 : హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ''తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం సమాలోచన'' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారంతో విజయవంతంగా ముసిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆచార్య పిల్లలమర్రి రాములు హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం దేశీ ప్రక్రియలకు చందస్సు, సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా పాల్కురికి సోమనాథుడి కాలం నుంచి ప్రత్యేకతను కలిగి ఉందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య కాశీమ్ ప్రసంగిస్తూ తెలంగాణ ఉద్యమంలో పాట, ప్రజా సంఘాల పాత్ర కీలకమైన పాత్ర పోషించాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ ఆచార్యులు బూ